18 రోజులుగా అటకెక్కిన చదువులు

సమ్మెలో కేజీబీవీ టీచర్లు, సిబ్బంది • సమీపిస్తున్న పది, ఇంటర్ పరీక్షలు • మెట్టు దిగని సర్కారు.. ఆందోళనలో విద్యార్థులు

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు.. మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలు. అటు టీచర్ల సమ్మె.. ఇటు సమీపిస్తున్న వార్షిక పరీక్షల నేపథ్యంలో కేజీబీవీల్లో పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్న ప్రధాన డిమాండ్‌తో సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారంతో 18వ రోజుకు చేరుకుంది. స్పెషలాఫీసర్లు, పీజీ సీఆర్టీలు, సీఆర్టీలంతా బోధన బంద్ పెట్టి సమ్మె చేస్తున్నారు. కొన్ని కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది (వంట మనుషులు, స్వీపర్లు, పారిశుధ్య కార్మికులు) సైతం సమ్మె చేస్తున్నారు. దీంతో 18 రోజులుగా విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. రాష్ట్రంలో 495 కేజీబీవీలుండగా, వీటిల్లో పదో తరగతిలో 25వేల మంది, ఇంటర్‌లో 10వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పదో తరగతి సిలబస్ పూర్తికాకపోవడం, రివిజన్ చేయాల్సి ఉండటంతో అంతిమంగా దీని ప్రభావం వార్షిక పరీక్షల ఫలితాలపై పడనుంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొన్నది. ప్రభుత్వం సమగ్రశిక్ష ఉద్యోగులు, కేజీబీవీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య కోరారు.

ఖమ్మం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం బజ్జీలు అమ్ముతూ వినూత్నంగా నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ఎస్ఎస్ఏ పోరాటానికి బీఆర్‌టీయూ మద్దతు

రెగ్యులరైజ్, టైం స్కేల్ వర్తింపజేయాలన్న డిమాండ్లతో పోరాటం చేస్తున్న సమగ్రశిక్ష (ఎస్ఎస్ఏ) ఉద్యోగులకు భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శుక్రవారం హైదరాబాద్ జిల్లా డీఈవో కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జీ రాంబాబు యాదవ్ సందర్శించి ఉద్యోగులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉద్యోగులకు తాము అండగా ఉంటామని, వారి న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాడతామని హామీనిచ్చారు. సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సమగ్రశిక్ష ఉద్యోగులకు రెండు దశాబ్దాలుగా ఉద్యోగ భద్రతలేదని, ఐదేండ్లుగా వేతనాలు పెంచలేదని, దీంతో 18 రోజులుగా వారు సమ్మె చేస్తున్నారని, సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమగ్రశిక్ష ఉద్యోగులతో ప్రభుత్వం, విద్యాశాఖ చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని మాజీ ఎమ్మెల్సీ బీ మోహన్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శులు బీరెల్లి కమలాకర్‌రావు, గుండు లక్ష్మణ్ ప్రభుత్వాన్ని కోరారు.

ఇదీ పరిస్థితి..

- కామారెడ్డి లింగంపేట కేజీబీవీలో 20 మంది స్టాఫ్ పనిచేస్తుండగా అందరూ సమ్మెలో ఉన్నారు. ఈ స్కూళ్లో 357 మంది విద్యార్థులున్నారు. పదో తరగతిలో 40, ఇంటర్‌లో 100మందికి పైగా విద్యార్థులున్నారు. ఉపాధ్యాయులు అందరూ సమ్మెలోకి వెళ్లడంతో క్లాసులు జరగడంలేదు. ఇదే జిల్లాలో 19 కేజీబీవీలుండగా అన్నింటిలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది.
- నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మస్కాపూర్ కేజీబీవీలో 13 మంది బోధనా సిబ్బంది, 8 మంది బోధనేతర సిబ్బంది సమ్మెలోకి వెళ్లారు. ఈ స్కూళ్లో 163 మంది విద్యార్థులున్నారు. ముగ్గురు టీచర్లు, నలుగురు వంట మనుషులను తాత్కాలికంగా సమకూర్చారు. 13 మంది టీచర్లు పనిచేయాల్సిన ఈ స్కూళ్లో ముగ్గురు టీచర్లతో పాఠాలు చెప్పిస్తున్నారు. భద్రత కోసం కానిస్టేబుళ్లకు విధులు కేటాయించారు.
- నిర్మల్ జిల్లా లక్షణచందా కేజీబీవీలో 16 బోధన, 12 మంది బోధనేతర సిబ్బంది సమ్మెలోకి వెళ్లారు. ఈ కేజీబీవీలో 395 విద్యార్థులుండగా, సమ్మెతో పదో తరగతి, ఇంటర్ సిలబస్ ఇంకా పూర్తికాలేదు.

కేజీబీవీలో 10 మంది విద్యార్థినులకు అస్వస్థత

- వాంతులు, కడుపునొప్పితో స్టూడెంట్స్‌కు ఇబ్బందులు
- ఉడకని అన్నం తినడమే కారణమంటున్న విద్యార్థినులు
- నిర్మల్‌లోని దవాఖానకు తరలింపు

నిర్మల్‌లోని ఏరియా దవాఖానలో చికిత్స పొందిన విద్యార్థినులు

సోన్, డిసెంబర్ 27 : నిర్మల్ జిల్లా నిర్మల్ మండలం అనంతపేట్ కేజీబీవీలోని పది మంది విద్యార్థినులు ఉడికీ ఉడకని అన్నం తిని శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం వండిన భోజనం సరిగా ఉడకకపోవడంతో పాఠశాలలో దాదాపు పది మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. వారిని మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానకు తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అందులో ఐదుగురి పరిస్థితి మెరుగుపడడంతో పాఠశాలకు పంపించారు. మరో ఐదుగురిని డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచారు. మిగతా విద్యార్థుల పరిస్థితి అదుపులోనే ఉండడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇదే విషయం పట్ల ఎంఈవోఓను వివరణ కోరగా భోజనం తయారు చేసే నిర్వాహకులు కొత్తగా విధుల్లో చేరినట్టు చెప్పారు. అన్నం వండడంలో సరైన అవగాహన లేక కొంతమేర ఉడకలేదని, దానిని తిన్న విద్యార్థులు వాంతులు చేసుకున్నట్టు పేర్కొన్నారు.

మాటలు వద్దు.. ఉత్తర్వులు కావాలి

- సీఎం కుర్చీ కోసం రేవంత్‌రెడ్డి 'ఆశ'లను మోసం చేసిండు
- తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

జయశంకర్ భూపాలపల్లి బహిరంగ సభలో మాట్లాడుతున్న జయలక్ష్మి

కృష్ణ కాలనీ, డిసెంబర్ 27 : 'ఉత్త మాటలు వద్దు... ఉత్తర్వులు జారీ చేయాలి' అని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి సర్కార్‌ను డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్లు 17రోజులుగా చేస్తున్న బస్సుజాత యాత్ర శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చేరుకోగా ఆశ వర్కర్లు స్వాగతం పలికారు. అంబేద్కర్ సెంటర్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండు సాయిలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బహిరంగసభలో జయలక్ష్మి మాట్లాడారు. వారికి ప్రతినెలా ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. గతంలో ధర్నా లు చేసినప్పుడు నాటి కాంగ్రెస్ నాయకుడు, నేటి సీఎం రేవంత్‌రెడ్డి, ప్రస్తుత మంత్రులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తక్షణమే ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి రాగానే మరిపోయారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీ కోసం ఆశ వర్కర్లను పూర్తిగా మోసం చేశారని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

'మా టీచర్లు మాకే కావాలి' అని జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లిలోని కేజీబీవీ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

మా టీచర్లు మాకే కావాలి

వెల్గటూర్/చేర్యాల, డిసెంబర్ 27 : 'మా టీచర్లు మాకే కావాలి' అంటూ జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి, సిద్దిపేట జిల్లా చేర్యాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల గేటు ఎదుట విద్యార్థినులు ఆందోళనకు దిగారు. సమగ్ర శిక్ష ద్వారా పని చేస్తున్న కేజీబీవీ సిబ్బంది తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ 18 రోజులుగా సమ్మె నిర్వహిస్తుండడంతో విద్యాశాఖ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ టీచర్లకు కేజీబీవీలో విధులు కేటాయిస్తూ ఆదేశాలు జారీచేశారు. కుమ్మరిపల్లి కేజీబీవీకి ఇన్‌చార్జి ప్రత్యేకాధికారిగా గొడిసెలపేట బీసీకాలనీలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సుశీలను నియమించారు. ఆమె శుక్రవారం పాఠశాలకు వెళ్లగా విద్యార్థినులు బైఠాయించి తమ టీచర్లు తమకే కావాలంటూ నినదించారు. పాఠశాల లోపలికి రాకుండా ఆమెను అడ్డుకున్నారు. దీంతో సుశీల వెనుతిరిగి వెళ్లారు. ఈ విషయాన్ని ప్రత్యేకాధికారి దీప, మండల విద్యాధికారి ప్రభాకర్‌కు సమాచారం ఇవ్వగా, వారు డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. డీఈవో రాము పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసి పరిస్థితిని సమీక్షించి వెళ్లారు. చేర్యాలలో ఎంఈవో రచ్చ కిష్టయ్య కేజీబీవీకి వచ్చి విద్యార్థినులను సముదాయించే ప్రయత్నం చేశారు. సర్కారు స్పందించకపోతే తాము సైతం ఆందోళన చేపతామని విద్యార్థినులు హెచ్చరించారు.

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న జీపీ సిబ్బంది

ఆరు నెలలుగా వేతనాల్లేవు

- మా కుటుంబాలు గడవడం లేదు
- రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మెబాట

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలుగా వేతనాలు అందించడం లేదని.. ఫలితంగా తమ కుటుంబాలు గడవక పస్తులుండాల్సి వస్తుందని గ్రామ పంచాయతీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాల ఎదుట రెండు రోజుల టోకెన్ సమ్మెను ప్రారంభించారు. తెలంగాణ జీపీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ నాయకుల పిలుపు మేరకు సమ్మెను చేపట్టినట్టు తెలిపారు. ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇస్తూ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే జనవరి 4 తర్వాత నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు హెచ్చరించారు. టోకెన్ సమ్మెకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.

సీఏ ఫైనల్ టాపర్‌గా హైదరాబాదీ

ఆలిండియా టాపర్‌గా హేరంబ్ మహేశ్వరి

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : సీఏ ఫైనల్ ఫలితాల్లో హైదరాబాద్ విద్యార్థి సత్తా చాటాడు. నగర విద్యార్థి హేరంబ్ మహేశ్వరి ఆలిండియా టాపర్‌గా నిలిచాడు. నవంబర్‌లో నిర్వహించిన సీఏ ఫైనల్ పరీక్షల ఫలితాలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్(ఐసీఏఐ) శుక్రవారం విడుదల చేసింది. హైదరాబాద్ విద్యార్థి హేరంబ్ మహేశ్వరి, తిరుపతికి చెందిన రిషబ్ ఓస్వాల్ ఆర్ సైతం 84.67శాతం స్కోర్‌తో ఆలిండియా టాపర్లుగా నిలిచారు. అహ్మదాబాద్ విద్యార్థి రియా కుంజాకుమారి రెండోర్యాంకు, కోల్‌కత్తాకు చెందిన కింజల్ ఆజ్మీరా మూడో ర్యాంకు సాధించారు. ఈ ఏడాది సీఏ గ్రూప్-1కు 66,987 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే 11,253 మంది (16.8శాతం)పాసయ్యారు. ఇక సీఏ గ్రూప్-2కు 49,459 మందికి 10,566 మంది అభ్యర్థులు (21.36శాతం) ఉత్తీర్ణత సాధించారు. రెండింటికి 30,763 మంది పరీక్ష రాస్తే 4,134(13.44శాతం) మంది పాసయ్యారు.

మైనర్లకు బైక్ ఇస్తే జైలుకే..!

తల్లిదండ్రులకు తెలంగాణ పోలీసు హెచ్చరిక

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : పిల్లలు ఏడుస్తున్నారనో, అడిగింది ఇవ్వలేదని మారాం చేస్తున్నారనో.. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులను బాధ్యులను చేసి, జైలుకు పంపిస్తామని ఎక్స్ వేదికగా పోలీసుశాఖ పోస్టు చేసింది. 'పిల్లల సరదా కోసం మైనర్లకు వాహనాలు ఇస్తున్నారా..? మీరు చేసే పని మీతో పాటు ఇతరులను కూడా ఇబ్బందుల్లోకి నెడుతుంది. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే.. ఆ తల్లిదండ్రులదే బాధ్యత. వారు కూడా జైలుకు వెళ్లక తప్పదు' అంటూ తెలంగాణ పోలీసు శాఖ తల్లిదండ్రులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది.

బీవోబీలో 1,267 ఖాళీలు

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీలో వివిధ విభాగాల్లో 1,267 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఫైనాన్స్, ఐటీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ తదితర విభాగాల్లో మేనేజర్, మార్కెటింగ్ ఆఫీసర్, ఏజీఎం, సీనియర్ డెవలపర్, ఏఐ ఇంజినీర్ తదితర ఖాళీలు ఉన్నాయి. జనవరి 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు వెబ్‌సైట్ www.bankofbaroda.co.in చూడవచ్చు.

ఎస్‌బీఐలో 600 పీవో పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో 600 ప్రొబేషనరీ ఆఫీసర్(పీవో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. డిగ్రీ ఉత్తీర్ణులు లేదా ప్రస్తుతం ఫైనల్ ఇయర్ పరీక్షలు రాస్తున్నవారు అర్హులు. వయస్సు 21-30 ఏండ్ల మధ్య ఉండాలి. ప్రిలిమినరీ, మెయిన్స్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ ఎక్సర్‌సైజ్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జనవరి 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు వెబ్‌సైట్ https://bank.sbi చూడవచ్చు.

క్లాస్‌రూముల్లో సెల్‌ఫోన్లపై నిషేధం!

- తెలంగాణ ఉన్నత విద్యామండలి సమాలోచనలు
- త్వరలోనే వర్సిటీ, కాలేజీల యాజమాన్యాలతో సమావేశం

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తేతెలంగాణ): క్లాస్‌రూముల్లో సెల్‌ఫోన్ల వినియోగాన్ని నిషేధించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి భావిస్తున్నది. విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టకుండా నిత్యం సెల్‌ఫోన్ వినియోగిస్తున్నట్టు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. అటు విద్యార్థులు, ఇటు అధ్యాపకుల ఏకాగ్రతకు భంగం కలుగడంతోపాటు బోధనకు అంతరాయం కలుగుతున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్ల వాడకాన్ని కట్టడి చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలుస్తున్నది. త్వరలోనే యూనివర్సిటీ, కాలేజీల యాజమాన్యాలతో సమావేశమై చర్చించనున్నట్టు సమాచారం. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని తుది నిర్ణయం తీసుకోనున్నది. విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లేముందు సెల్‌ఫోన్లను కార్యాలయాల్లో భద్రపరుచుకునేలా తగిన ఏర్పాట్లు చేయనున్నారు. బ్రేక్‌టైంలో, తరగతులు పూర్తైన తర్వాతే సెల్‌ఫోన్లను తీసుకొనే వెసులుబాటు కల్పించనున్నారు.

రంగారెడ్డి జిల్లా లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్ వద్ద గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, సంఘం నాయకులు

మాజీ సర్పంచుల వినూత్న నిరసన

- రాష్ట్రవ్యాప్తంగా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాల సమర్పణ
- ప్రభుత్వం పట్టించుకోకుంటే ఉద్యమం ఉధృతం
- లంగర్‌హౌజ్ నిరసనలో జేఏసీ చైర్మన్ యాదయ్యగౌడ్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పెండింగ్ బిల్లులు చెల్లించాలన్న ప్రధాన డిమాండ్‌తో తాజా మాజీ సర్పంచులు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా వినూత్న నిరసనలకు దిగారు. తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా గాంధీజీ విగ్రహాలకు వినతిపత్రాలను సమర్పించి నిరసనలు వ్యక్తం చేశారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం జేఏసీ నేతలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సొంత నగదు వెచ్చించి గ్రామాల అభివృద్ధికి కృషిచేసిన మాజీ సర్పంచులను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని యాదయ్యగౌడ్, జేఏసీ నేతలు ధ్వజమెత్తారు. అధికారంలోకి రాగానే బిల్లులిస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్.. ఏడాది దాటినా నిర్లక్ష్యం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి బిల్లులు చెల్లించాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, నాయకులు కేశబోయిన మల్లయ్య, గణేశ్, నవీన్‌కుమార్, పల్లె వెంకటేశం, ప్రణీత్ చంద్, బాషబోయిన ఉప్పలయ్య, రమేశ్, పూర్ణచందర్‌గౌడ్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

300 కి.మీ దూరంలో పరీక్షా కేంద్రం

- ఖమ్మం అభ్యర్థికి సిద్దిపేటలో.. సత్తుపల్లి అభ్యర్థికి మేడ్చల్‌లో సెంటర్
- టెట్ సెంటర్ల కేటాయింపులో చిత్రవిచిత్రాలు
- మండిపడుతున్న అభ్యర్థులు

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఎక్కడి ఖమ్మం.. ఎక్కడి సిద్దిపేట. దాదాపు 225 కిలోమీటర్ల పైమాటే. నాలుగున్నర గంటల ప్రయాణం. మూడు, నాలుగు బస్సులు మారాల్సిందే. ఇవేవీ చూడకుండా ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మహిళా అభ్యర్థికి సిద్దిపేటలో టెట్ పరీక్ష సెంటర్ కేటాయించారు. సత్తుపల్లి నుంచి మేడ్చల్‌కు 303 కిలోమీటర్లు. ఐదున్నర గంటల ప్రయాణం. ఇదే అభ్యర్థి దరఖాస్తు సమయంలో ఖమ్మం, సత్తుపల్లి, సూర్యాపేట, వరంగల్ ఆప్షన్లు ఇస్తే, మేడ్చల్ జిల్లాలో సెంటర్ కేటాయించారు. జనగామ జిల్లాకు చెందిన మరో అభ్యర్థి హనుమకొండ, వరంగల్, కరీంనగర్ ఆప్షన్లు ఇస్తే సంబంధం లేని బాచుపల్లిలో సెంటర్ కేటాయించారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ అభ్యర్థికి వరంగల్‌లో సెంటర్ కేటాయించారు. ఇలా.. టెట్ పరీక్ష సెంటర్ల కేటాయింపులో విద్యాశాఖ ఇష్యూరాజ్యంగా వ్యవహరించింది. దగ్గర, దూరం అని తేడాల్లేకుండా ఆప్షన్లను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టారీతిన సెంటర్లను కేటాయించింది. ఒక్కో అభ్యర్థికి 200-300 కిలోమీటర్ల దూరంలో సెంటర్లు వేశారు. ఇదేదో ఒకరు ఇద్దరు అనుకుంటే పొరపాటే. వందలాది మంది అభ్యర్థులకు ఇష్టానుసారం పరీక్షాకేంద్రాలను కేటాయించారు.

చివరి ఆప్షన్ల చోట సెంటర్లు

కనీసం అభ్యర్థుల సొంత జిల్లాలో కేటాయించకపోగా, మొదటి ప్రాధాన్యతగా ఎంచుకున్న జిల్లాల్లో సెంటర్ కేటాయించలేదు. ఖమ్మం జిల్లా అభ్యర్థులకు సిద్దిపేటలో పరీక్షా కేంద్రాలను కేటాయించగా, ఉదయం సెషన్ పరీక్ష 9గంటలకే ప్రారంభవుతుంది. రెండు గంటల ముందే పరీక్షకేంద్రం వద్ద ఉండాలి. అంటే 7 గంటల్లోపే సెంటర్ వద్ద ఉండాలి. ఇలా జరగాలంటే రాత్రంతా ప్రయాణం చేయడంతోపాటు నిద్రమానుకోవాల్సిన పరిస్థితి. మహిళా అభ్యర్థుల అవస్థలు వర్ణణాతీతం. సెంటర్లు దూరంగా వేయడంతో పరీక్షలు రాయడమా..? లేదా? అన్న ఆలోచనలో అభ్యర్థులున్నారు. ఇలా పరీక్షా కేంద్రాలను కేటాయించడంపై అభ్యర్థులు మండిపడుతున్నారు. తాము మొదట ఆప్షన్ ఇచ్చిన చోట పరీక్షాకేంద్రాలను కేటాయించలేదని, చివరి ఆప్షన్లుగా ఎంపికచేసుకున్న మేడ్చల్, హైదరాబాద్, సిద్దిపేట ఇస్తే ఇదే జిల్లాల్లో సెంటర్లు వేసి చేతులు దులుపుకున్నారని వాపోతున్నారు. అయితే గత మే, జూన్‌లో జరిగిన టెట్ పరీక్షల్లో ఎక్కువ మందికి సొంత ఉమ్మడి జిల్లాల్లోనే సెంటర్లు కేటాయించారు. చివరగా దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే దూర ప్రాంతాల్లో సెంటర్లు కేటాయించారు. కానిప్పుడు ఎక్కువ మందికి చివరి ఆప్షన్‌గా ఇచ్చిన చోట సెంటర్లు వేయడం గమనార్హం. టెట్ అంశాలపై అధికారులను ఆరా తీసేందుకు ఫోన్‌లో సంప్రదించగా.. ఎవరు అందుబాటులోకి రాలేదు.

ఎట్టకేలకు హాల్‌టికెట్లు విడుదల..

సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఎట్టకేలకు గురువారం రాత్రి 11 గంటలకు టెట్ హాల్‌టికెట్లను విద్యాశాఖ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ విషయంలోనూ ఇదే జరిగింది. ఆలస్యంగా రాత్రి 10 గంటల తర్వాత నుంచి దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. టెట్ పరీక్షలను 2 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. అయితే హాల్‌టికెట్లను పూర్తిస్థాయిలో విడుదల చేయలేదు. జనవరి 11 ఉదయం, జనవరి 20న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్ల హాల్‌టికెట్లను ఇంకా విడుదల చేయలేదు. ఈ హాల్‌టికెట్లను శనివారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ తెలిపింది. కాగా సాంకేతిక సమస్యలతో కొందరు అభ్యర్థుల హాల్‌టికెట్లు గురువారం రాత్రి డౌన్‌లోడ్ కాలేదు. దీంతో అభ్యర్థులకు టెన్షన్ పట్టుకుంది. ఎట్టకేలకు శుక్రవారం మధ్యాహ్నం తర్వాత కొందరి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ అయ్యాయి.

రైలులో బాలుడిని వదిలేసిన మహిళ

కాజీపేట రైల్వే స్టేషన్‌లో బాలుడిని దింపిన జీఆర్పీ సిబ్బంది

కాజీపేట, డిసెంబర్ 27 : నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో శుక్రవారం ఓ మహిళ బాలుడిని వదిలి వెళ్లింది. గుర్తించిన జీఆర్పీ పోలీసులు హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే స్టేషన్‌లో దింపి చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌కు అప్పగించారు. జీఆర్పీ ఎస్‌హెచ్‌వో రామ్మూర్తి కథనం ప్రకారం.. నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్‌కు వెళ్తున్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో ఓ మహిళ మూడేండ్ల వయసున్న బాలుడితో వెళ్తున్నది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు ఆగి తిరిగి బయలుదేరుతుండగా ఆ మహిళ బాలుడిని రైలులోనే వదిలి దిగి వెళ్లిపోయింది. గుర్తించిన ప్రయాణికులు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. రైలు కాజీపేట రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే జీఆర్పీ సిబ్బంది జనరల్ బోగీలో ఉన్న బాలుడిని తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌కు అప్పగించారు. సంబంధికులు ఉంటే కాజీపేట జీఆర్పీ ఎస్‌హెచ్‌వోను, లేదా 8712658609, 94900 27342 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎస్సైకి వారం జైలు

కోర్టు ధిక్కరణ కేసులో తీర్పు

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ఓ వ్యక్తిని అరెస్టు చేసిన తరిగొప్పుల ఎస్సైకి హైకోర్టు వారం జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. బాధితుడికి 50 వేలు చెల్లించాలని ఆదేశిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. జనగామ జిల్లా తరిగొప్పుల మండలానికి చెందిన గొలుసు నర్సయ్యపై ధాన్యం విక్రయం విషయంలో కేసు నమోదవడంతో బాధితుడు హైకోర్టును ఆశ్రయించాడు. విచారించిన న్యాయస్థానం సీఆర్పీసీ సెక్షన్ 41ఏ ప్రకారం నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించింది. అయితే, కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ ఎస్ఐ నరేశ్‌యాదవ్.. నర్సయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో విచారించిన జస్టిస్ కే సురేందర్ ఎస్సైకి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. న్యాయవాది అభ్యర్థన మేరకు తీర్పు అమలును పది రోజులు నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

రామన్నపేటలో అంబుజా పరిశ్రమ ప్రతిపాదిత స్థలంలో పనులను అడ్డుకుంటున్న పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులు, స్థానికులు

'అంబుజా' పనులు ప్రారంభిస్తే ఊరుకోం

రామన్నపేటలో పనులను అడ్డుకున్న స్థానికులు

రామన్నపేట, డిసెంబర్27: డ్రైపోర్టు పేరుతో అ